# కమల్ అమృత్ వాణి-262

సంకల్పో యస్య దృఢో హి తస్య పంథాః
సుగమో భవేత్ । చిత్తస్థైర్యేణ సాధ్యంతే
కార్యాణి దుర్లభాన్యపి ॥
తాత్పర్యం. దృఢమైన సంకల్పం విజయానికి తొలి మెట్టు.మనసులో లక్ష్యం స్పష్టంగా ఉన్నప్పుడు అడ్డంకులు మన ప్రయాణాన్ని పూర్తిగా ఆపలేవు.పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా సంకల్పబలం మనలను ముందుకు నడిపిస్తుంది.అవకాశం కోసం ఎదురుచూడటం కంటే మన లక్ష్యానికి మార్గాన్ని మనమే నిర్మించుకోవాలి.దృఢచిత్తంతో వేసిన ప్రతి అడుగు అసాధ్యాన్ని సుసాధ్యం చేసే శక్తిగా మారుతుంది.



✍కమలేకర్ నాగేశ్వర్ రావు 'కమల్'

## ఏపీలో ఉద్యోగాల జాతర.. 892 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు

-నిరుద్యోగ యువతకు శుభవార్త
- టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి




వేంపల్లె సెప్టెంబరు 20 (కదిలించే వార్త):
ఆంధ్రప్రదేశ్‌లో ఏపీపీఎస్సీ ద్వారా వివిధ శాఖల్లో 892 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల చేయడం నిరుద్యోగ యువతకు శుభవార్త అని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.163 గ్రూప్--1 పోస్టులతో పాటు మరో 729 పోస్టుల భర్తీకి ప్రభుత్వం ప్రక్రియ ప్రారంభించిందన్నారు. ఉద్యోగార్థులకు మరింత అవకాశం కల్పించేలా గరిష్ట వయోపరిమితిని 34 ఏళ్ల నుంచి 44 ఏళ్లకు పెంచడం అభినందనీ యమన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్న కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్‌లకు కడప జిల్లా నిరుద్యోగ యువత తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

## అంకాలమ్మ తల్లికి విశేష పూజలు

-ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అంకాలమ్మ తల్లి



పులివెందుల అర్బన్ సెప్టెంబర్ 20
పులివెందల పట్టణం పార్నపల్లి రోడ్డు సమీపంలో నడిబొడ్డున కొలువై ఉన్న అంకాలమ్మ తల్లికి ఆదివారం పర్వదినాన ప్రత్యేక పూజలు ఆలయ ప్రధాన అర్చకులు సురేష్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయాస్తమాన అమ్మవారికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, కుంకుమార్చన, తదితర పూజా కైకర్యాల అనంతరం పట్టు వస్త్రాలతో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు అందుకొని మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుందని, ప్రతి ఆదివారం ఆలయానికి వస్తున్నటువంటి భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక చర్యలు ఏర్పాటు చేస్తూ జాగ్రత్తలు వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ఆలయ నిర్వహణ ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ అధికారులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ ఏపీ ఎన్జీ జిఓస్ రాష్ట్ర అధ్యక్షులు - జేఏసీ చైర్మన్ అలపర్తి విద్యాసాగర్ కి ప్రత్యేక ధన్యవాదాలు



పులివెందుల కదిలించే వార్త సెప్టెంబర్ 20
రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు ఆరు సంవత్సరములు సర్వీసును క్రమబద్ధీకరిస్తూ 20-9-2026 తేదీన జీవసంఖ్య 7, ( ఆటోమేటిక్ అడ్వాన్స్ స్కీం) ప్రభుత్వం నుండి విడుదల చేయించిన సందర్భంగా పులివెందుల తాలూకా ఏపీ ఎన్జీవోస్ మరియు స్వర్ణ వార్డు గ్రామ సచివాలయ ఉద్యోగుల తరఫున పులివెందుల తాలూకా ఏపీ ఎన్జీవోస్ అధ్యక్షులు గజ్జల జగన్నాథ్ రెడ్డి మరియు ఉపాధ్యక్షులు వై ప్రభు కుమార్ హర్ష వ్యక్తం చేస్తూ ఏ .విద్యాసాగర్ కి మరియు జనరల్ సెక్రెటరీ డి.వి రమణ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగినది ప్రత్యేకించి కడప జిల్లా పర్యటనలో సచివాలయ ఉద్యోగుల తరఫున ఇచ్చిన హామీని త్వరితగతిలో సాధించటంలో కృషిచేసి ఈ జీవో సాధించినందుకు గాను రాష్ట్ర ఏపీ ఎన్జీ జీవోస్ అధ్యక్షులు మరియు జేఏసీ చైర్మన్ శ్రీ అలపర్తి విద్యాసాగర్ మరియు మరియు జనరల్ సెక్రెటరీ డివి రమణ కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేయడం జరిగినది మరియు ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగుల మిగిలిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఉద్యోగులపక్షంగా మరియు సచివాలయ ఉద్యోగుల పక్షంగా నిరంతర పోరాటం చేస్తున్న రాష్ట్ర ఏపీ ఎన్జీవోస్ అధ్యక్షులు కామ్రేడ్ అలపర్తి విద్యాసాగర్ కి మరియు జనరల్ సెక్రెటరీ డివి రమణ కి ప్రత్యేక ధన్యవాదాలు పులివెందుల తాలూకా ఎన్జీవోస్ మరియు సచివాలయ ఉద్యోగుల పక్షంగా వెన్నంటి ఉంటామని వారి సమస్యలను పరిష్కరించడంలో కృషి చేస్తామని తెలియజేయడం జరిగినది.

## వేంపల్లెలో ఘనంగా అజ్జుగుట్టు రఘునాథ్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు

-టిడిపి నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు



వేంపల్లె సెప్టెంబరు 20 (కదిలించే వార్త):
వేంపల్లె టిడిపి మండల ఇన్‌చార్జ్ అజ్జుగుట్టు రఘునాథ్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీసీ నాయకుడు దక్కా రమేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు.స్థానిక టిడిపి కార్యాలయంలో మండల కన్వీనర్ రామమునిరెడ్డి, టిడిపి క్లస్టర్ ఇన్‌చార్జ్ మహమ్మద్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు తినిపించారు. తమ నాయకుడు రఘునాథ్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను కార్యకర్తల మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉందని మండల కన్వీనర్ రామమునిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మాజీ మిలటరీ రెడ్డయ్య, జనసేన నాయకుడు పోతిరెడ్డి చలపతి, జబిబుల్లా, సాదక్, బాలకృష్ణారెడ్డి, ఈశ్వరయ్య, బాబు, నాయక్, వీరభద్ర, మడక శ్రీనివాసులు, ఉప్పు రమేష్, పామిశెట్టి ఆంజి, దక్కా రమణ, కేశవ, రమణ, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో చైతన్య విద్యార్థుల వినాయక నిమజ్జనం







-నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో సందడిగా వేడుకలు
వేంపల్లె సెప్టెంబరు 20 (కదిలించే వార్త):
వినాయక చవితి వేడుకల ముగింపు సందర్భంగా వేంపల్లి శ్రీ చైతన్య హైస్కూల్‌లో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని భక్తిశ్రద్ధలతో గణనాథుడికి వీడ్కోలు పలికారు.విద్యార్థులు సంప్రదాయ వేషధారణలో నృత్యాలు, ఆకట్టుకునే గెటప్‌లు, సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. ఉపాధ్యాయులు సైతం విద్యార్థులతో కలిసి పాల్గొని వేడుకకు మరింత ఉత్సాహాన్ని తీసుకొచ్చారు.పాఠశాల చైర్మన్ బి.చక్రపాణి రెడ్డి మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై ఆసక్తితో పాటు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. భక్తి, సాంస్కృతిక వైభవం, ఆనందోత్సాహాల మధ్య నిమజ్జన కార్యక్రమం ఘనంగా ముగిసింది.

# ఘనంగా వినాయకుని నిమజ్జన వేడుకలు

-వారం రోజులుగా నారాయణ విద్యాసంస్థలో ప్రత్యేక పూజలు..
విద్యార్థులకు అన్నదానం
వేంపల్లె సెప్టెంబరు 20 (కదిలించే వార్త):
వేంపల్లె పట్టణంలోని పాత గండి రోడ్డులో ఉన్న నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాల, నారాయణ జూనియర్ కళాశాలల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వినాయకుని నిమజ్జన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు.వారం రోజులుగా గణనాథుడిని పూలదండలతో అలంకరించి విద్యార్థులు, ఉపాధ్యాయులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు 'గణపతి బప్పా మోరియా' అంటూ తమకు విద్యాబుద్ధులు, జ్ఞానం ప్రసాదించాలని వినాయకుని ప్రార్థించారు.నారాయణ విద్యాసంస్థల అధినేత కొట్టె నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి, విద్యార్థినీ విద్యార్థులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం గణనాథుడిని గండిక్షేత్రంలోని పాపాఘ్ని నదిలో భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు.ఈ సందర్భంగా విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని 'జై గణేషా.. జై జై గణేషా' అంటూ నినాదాలు చేస్తూ నిమజ్జన వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.





# భారీ వర్షానికి ఇళ్లలోకి నీరు

-శ్రీనివాస హాల్ వెనుక సందులో 40 ఇళ్ల వరకు ఇబ్బందులు
-స్పందించిన మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ తూగుట్ల మధుసూదన్‌రెడ్డి
పులివెందుల, కదిలించే వార్త సెప్టెంబర్ 20,
పులివెందుల పట్టణంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి శ్రీనివాస హాల్ వెనుకనున్న సందులోని పలు ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నా రు. దాదాపు 30 నుంచి 40 ఇళ్ల వరకు నీరు చేరడంతో రాత్రంతా ప్రజలు నిద్రకు దూరమై అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది.వర్షం కారణంగా ఇళ్ల చుట్టూ, వీధుల్లో భారీగా నీరు నిలిచిపో వడంతో ప్రజలు బయటకు రావడానికి కూడా ఇబ్బందులు పడ్డారు. మురుగునీరు, వర్షపు నీరు కలిసి ఇళ్ల పరిసరాల్లో చేరడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు.

-అధికారులను అప్రమత్తం చేసిన మధుసూదన్‌రెడ్డి
స్థానికుల ఇబ్బందుల విషయం తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ నాయకుడు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ తూగుట్ల మధుసూదన్‌రెడ్డి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడి పరిస్థితిని స్వయంగా పరిశీలించి స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత మున్సిపల్ అధికారులను అక్కడికి పిలిపించి, తక్షణమే నీటిని తొలగించే చర్యలు చేపట్టాలని సూచించారు. మున్సిపాలిటీ సిబ్బందిని రంగంలోకి దించి నిలిచిపోయిన నీటిని తొలగించే పనులు ప్రారంభించారు. జేసీబీని కూడా అక్కడికి రప్పించి, మురుగునీరు నిలిచిన ప్రాంతాలను శుభ్రం చేయించారు.

- పూర్తిగా తొలగించాలని సూచన
మధుసూదన్‌రెడ్డి అక్కడే ఉండి పనులను పర్యవేక్షిస్తూ, నిలిచిన మురుగునీటిని పూర్తిగా తొలగించిన అనంతరం పరిసర ప్రాంతాలను శుభ్రం చేయాలని మున్సిపల్ అధికారులను కోరారు. ముఖ్యంగా ఇళ్ల మధ్యలో, వీధుల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీరు తొలగించిన అనంతరం పరిసర ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని, పారిశుద్ధ్య చర్యలు చేపట్టి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మున్సిపల్ పారిశుద్ధ్య విభాగం అధికారులను, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను కోరారు.



- శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికుల విజ్ఞప్తి
భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి ఈ ప్రాంతంలో వర్షపు నీరు ఇళ్లలోకి చేరుతున్నందున సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. వర్షపు నీరు సులభంగా బయటకు వెళ్లేలా కాలువలు, డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉన్న సమయంలో తూగుట్ల మధుసూదన్ రెడ్డి , అధికారులు, మున్సిపల్ సిబ్బంది వెంటనే స్పందించి నీటిని తొలగించే చర్యలు చేపట్టడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



# అసాంఘిక కార్యకలాపాల నివారణకు డ్రోన్ బీట్







-జూదం, మట్కా, బహిరంగ మద్యం సేవనంపై పోలీసుల నిఘా
వేంపల్లె సెప్టెంబరు 20 (కదిలించే వార్త):
జూదం, మట్కా, బహిరంగంగా మద్యం సేవించడం, ఇతర అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు వేంపల్లె పోలీసులు డ్రోన్ బీట్ నిర్వహించారు. సీఐ వేంపల్లె ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రోన్ ద్వారా నిఘా కొనసాగించారు.చింతరాంపల్లి, కడప రోడ్డు, గాజులపేట, స్పోర్ట్స్ స్టేడియం ప్రాంతం, హనుమాన్ సర్కిల్, అలవలపాడు రోడ్డు తదితర ప్రాంతాల్లో డ్రోన్ బీట్ నిర్వహించి అనుమానాస్పద కదలికలను పరిశీలించారు. బహిరంగ ప్రదేశాల్లో జూదం, మట్కా, మద్యం సేవించడం వంటి కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.ప్రజలకు ఇబ్బందులు కలిగించే అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని, శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని సీఐ తెలిపారు.

# అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

కదిలించే వార్త:- రణస్థలం సెప్టెంబర్ - 20,
రణస్థలం మండలం బంటుపల్లి పంచాయతీ కంబాలపేట గ్రామంలో శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి 7వ రోజు ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎచ్చెర్ల ఎమ్మెల్యే శ్రీ నడుకుదిటి ఈశ్వరరావు ఎన్ ఈ ఆర్ పాల్గొన్నారు. అనంతరం స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ బి ఎల్ ఏ -1 శ్రీ నడుకుదిటి తేజ మరియు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# వినాయకుని లడ్డూను రూ.22 వేలకు దక్కించుకున్న గోరంట్ల మురళి

**కడప సెప్టెంబర్ 20 కదిలించే వార్త**

నగరంలోని 9వ డివిజన్ రత్న సభాపతి వీధిలో ఏర్పాటు చేసిన వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వినాయకుని లడ్డూ వేలం పాటను నిర్వహించారు. ఈ వేలం పాటలో స్థానిక నివాసి గోరంట్ల మురళి కుమారుడు గోరంట్ల సాయి చరణ్ రూ.22 వేలతో లడ్డూను దక్కించుకున్నారు. వేలం పాటలో లడ్డూను దక్కించుకున్న సాయి చరణ్‌ను ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. అనంతరం బ్యాండు మేళాలతో ఊరేగింపు నిర్వహించి, స్వామివారి లడ్డూను సాయి చరణ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వినాయక చవితి ఉత్సవ కమిటీ ప్రతినిధులు గోరంట్ల సాయి, సిద్ధయ్య, శంకరాచారి, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# రాయలసీమలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

**కడప, సెప్టెంబర్ 20: కదిలించే వార్త**

రాయలసీమలో తక్షణమే హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలని వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి. నారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. కడప వైఎస్సార్ ప్రెస్ క్లబ్‌లో వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమ తరతరాలుగా వెనుకబాటుతనానికి గురవుతోందని, సాగునీటి ప్రాజెక్టులు, విభజన హామీల అమలులో జాప్యం జరుగుతోందని ఆయన అన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అడ్వకేట్ రాఘవ రెడ్డి మాట్లాడుతూ, రాజకీయాలకు అతీతంగా హైకోర్టు బెంచ్ కోసం ఉద్యమించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రభుత్వం స్పందించకపోతే మరోసారి ఉద్యమాలు చేపడతామని అన్నారు.ఈ సమావేశంలో పలువురు న్యాయవాదులు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. భవిష్యత్ కార్యాచరణ కోసం 15 మందితో సమన్వయ కమిటీని ఏర్పాటు చేశారు.




# కడప--పులివెందుల జాతీయ రహదారిపై వాహన తనిఖీలు





**-నిబంధనలు ఉల్లంఘించిన వారికి ఈ-చలాన్లు**

**వేంపల్లె సెప్టెంబరు 20 (కదిలించే వార్త):**

ట్రాఫిక్ నిబంధనల అమలులో భాగంగా వేంపల్లె పోలీసులు ఆదివారం కడప--పులివెందుల జాతీయ రహదారిపై వాహన తనిఖీలు నిర్వహించారు. సీఐ వేంపల్లె పర్యవేక్షణలో చేపట్టిన తనిఖీల్లో ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలను పరిశీలిం చారు.ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులను గుర్తించి వారికి ఈ-చలాన్లు విధించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని పోలీసులు సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# జయలక్ష్మీపురంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ విజయవంతంగా ముగింపు






**అనంతపురం, కదిలించే వార్త, సెప్టెంబర్ 20 :**

జై గురుదత్త । శ్రీ గురుదత్త పూజ్య శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ మరియు పూజ్య శ్రీ దత్తవిజయానంద తీర్థ స్వామీజీ వారి దివ్య ఆశీస్సులతో, కిమ్స్ సవీరా హాస్పిటల్ -- కిమ్స్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ సహకారంతో శ్రీ జయలక్ష్మీ మాత ఉచిత వైద్యశాల, జయలక్ష్మీపురం నందు నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ విజయవంతంగా ముగిసింది. ఈ క్యాంప్‌కు జయలక్ష్మీపురం పరిసర ప్రాంతాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. 105 మందికి పైగా ప్రజలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి. క్యాంప్‌లో వివిధ రకాల క్యాన్సర్లకు సంబంధించి అవసరమైన ప్రాథమిక స్క్రీనింగ్ పరీక్షలు మరియు వైద్యుల సంప్రదింపులు అందించబడ్డాయి. క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడం, ప్రజల్లో క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. ఈ క్యాంప్ విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించిన కిమ్స్ సవీరా హాస్పిటల్, కిమ్స్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ వైద్యులు మరియు సిబ్బంది, సేవా కార్యకర్తలు, వాలంటీర్లు, అలాగే వివిధ గ్రామాల నుంచి ప్రజలను తీసుకువచ్చిన వారందరికీ నా+నా ఆశ్రమం తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.





# మధురపూడి ఎయిర్‌పోర్ట్‌లో మంత్రి నారా లోకేష్‌కు ఘన స్వాగతం పలికిన జ్యోతుల నవీన్

**-కాకినాడలో 'భారతీయం' కార్యక్రమానికి చీఫ్ గెస్ట్‌గా లోకేష్**

**జగ్గంపేట,సెప్టెంబర్ 20 (కదిలించే వార్త):**

కాకినాడలో ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరుగుతున్న 'భారతీయం' కార్యక్రమానికి మంత్రి నారా లోకేష్ ఆదివారం విచ్చేస్తున్నారు.ఇందులో భాగంగా ఆదివారం ఉదయం రాజమండ్రి మధురపూడి విమానాశ్రయానికి చేరుకున్న నారా లోకేష్‌కు కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ,జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి సంస్థ చైర్మన్ జ్యోతుల నవీన్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది.విమానాశ్రయంలో జరిగిన భేటీలో జిల్లాలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులపై లోకేష్, నవీన్ చర్చించారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కాకినాడ జిల్లాలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి సమన్వయ కమిటీ పనితీరు, బూత్ స్థాయి బలోపేతంపై లోకేష్ ఆరా తీశారు.జిల్లాలో కూటమి అభ్యర్థులను గెలిపించుకునేందుకు నాయకులు, కార్యకర్తలంతా సమన్వయంతో దూకుడుగా ముందుకు సాగాలని, గెలుపే లక్ష్యంగా కసరత్తు చేయాలని ఈ సందర్భంగా నారా లోకేష్ స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.అనంతరం నారా లోకేష్ ఉదయం 9.30 గంటలకు రాజమహేంద్రవరం నుండి రోడ్డు మార్గంలో కాకినాడ రూరల్ తిమ్మాపురం ఆకుండి లక్ష్మీ స్మారక గోశాలకు లోకేష్ చేరుకుంటారు కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంలో 9.50 నుండి 10.20 గంటల వరకు 'భారతీయం' కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు దేశభక్తి, నైతిక విలువలపై ప్రసంగిస్తారు.



# చింతలమడుగుపల్లి రోడ్డా.. డంపింగ్ యార్డా?

**-చెత్త కుప్పలతో దుర్గంధం.. బాటసారులు, విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు**

**-పట్టించుకోని పంచాయతీ సిబ్బంది.. పరిశుభ్రత చర్యలు చేపట్టాలని గ్రామస్తుల విజ్ఞప్తి**

**వేంపల్లె సెప్టెంబరు 20 (కదిలించే వార్త):**



వేంపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని చింతలమడుగుపల్లికి వెళ్లే ప్రధాన రహదారి చెత్త కుప్పలతో డంపింగ్ యార్డును తలపిస్తోంది. రహదారి పక్కనే ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోవడంతో పరిసర ప్రాంతాల్లో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాల్సిన పంచాయతీ సిబ్బంది ఈ ప్రాంతంపై దృష్టి సారించకపోవడంతో పరిస్థితి రోజురోజుకూ అధ్వానంగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త కుప్పల కారణంగా దోమలు, ఈగలు వృద్ధి చెందడంతో పాటు పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని చెబుతున్నారు.ముఖ్యంగా సమీపంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సుమారు 250 మంది చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల సమీపంలోనే చెత్త పేరుకుపోవడంతో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం పడే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పరిసరాల్లో పారిశుధ్య లోపాల కారణంగా చిన్నారులు అనారోగ్యానికి గురై ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని పలువురు తల్లిదండ్రులు వాపోతున్నారు. దీనివల్ల ఆరోగ్య సమస్యలతో పాటు వైద్య ఖర్చుల రూపంలో ఆర్థిక భారం కూడా పడుతోందని పేర్కొంటున్నారు.ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు, సిబ్బంది స్పందించి రహదారి పక్కన పేరుకుపోయిన చెత్తను పూర్తిగా తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు. పరిసరాలను శుభ్రం చేసి, అవసరమైన చోట బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు క్రమం తప్పకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యార్థులు, బాటసారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు

# వేంపల్లెలో ఘనంగా అజ్జుగుట్టు రఘునాథరెడ్డి జన్మదిన వేడుకలు

**-కేక్ కట్ చేసి కార్యకర్తలు, ప్రజలకు పంపిణీ**



**వేంపల్లె సెప్టెంబరు 20 (కదిలించే వార్త):**

వేంపల్లె టీడీపీ మండల ఇన్‌చార్జి అజ్జుగుట్టు రఘునాథరెడ్డి జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీసీ నాయకుడు డక్కా రమేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి, కార్యకర్తలు, ప్రజలకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డక్కా రమేష్ మాట్లాడుతూ తమ నాయకుడు రఘునాథరెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉప్పు కుమార్, పామిశెట్టి ఆంజి, డక్కా రమణ, ఈశ్వరయ్య, కేశవ, యోగాంజిరెడ్డి, రమణ, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సరఫరా నిలిపివేతపై ప్రజల ఆగ్రహం

**-నిర్మాణ పనుల నేపథ్యంలో గంటల తరబడి కరెంట్ కట్.. ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు**

**వేంపల్లె సెప్టెంబరు 20 (కదిలించే వార్త):**



వేంపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేతపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని గరుగు వీధిలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సుమారు ఎనిమిదిన్నర గంటల పాటు విద్యుత్ లేకపోవడంతో ఉక్కపోతకు ప్రజలు అల్లాడిపోయారు.గరుగు వీధిలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఎదురుగా ఓ ఇంటి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నిర్మాణ ప్రదేశం వద్ద విద్యుత్ లైన్లు ఉండటంతో అవి పనులకు ఆటంకంగా మారినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో విద్యుత్ లైన్లను తొలగించడం లేదా ఇతర ఏర్పాట్లు చేయాలని సంబంధిత వారిని కోరినట్లు సమాచారం. అనంతరం విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చిందని ఆరోపిస్తున్నారు.అయితే విద్యుత్ సరఫరా ఎందుకు నిలిపివేశారని అధికారులను ప్రశ్నించగా.. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతు పనులు చేపడుతున్నందున సరఫరా నిలిపివేశామని అధికారులు సమాధానం ఇచ్చినట్లు స్థానికులు తెలిపారు.ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపివేయడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వ్యక్తిగత నిర్మాణ పనులకు అనుగుణంగా విద్యుత్ సరఫరా నిలిపివేశారా.. లేక నిజంగానే ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కారణంగానే సరఫరా నిలిచిందా అనే విషయంపై విద్యుత్ శాఖ అధికారులు స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

# హనుమద్ వాహనంపై శ్రీ రంగనాథుడు

**(పులివెందుల కదిలించే వార్త సెప్టెంబర్ 20,**



పులివెందుల శ్రీ రంగనాథ స్వామి వారి నూలు పుజ ఉత్సవాలలో భాగంగా ఆదివారం శ్రీరంగనాథ స్వామి శ్రీదేవి భూదేవి సమేతుడై హనుమత్ వాహనంపై కొలువుతిరి భక్తులకు దర్శనమిచ్చారు .ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వహణ ఏర్పాటు చేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, ఎండోమెంట్ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# 100 మందికి అన్నప్రసాద వితరణ



**కడప/ముస్తాబాద్ సెప్టెంబర్ 20 కదిలించే వార్త**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడెం గ్రామంలోని అన్నపూర్ణమ్మ ఫౌండేషన్‌లో ఎస్.జె.డబ్ల్యూ.హెచ్.ఆర్.సి ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. మండల చైర్మన్ చిలుక శారద ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వృద్ధులు, సిబ్బంది, సంరక్షకులు కలిపి సుమారు 100 మందికి అన్నప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా చిలుక శారద వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మానవ హక్కుల పరిరక్షణతో పాటు అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడం తమ బాధ్యత అని ఆమె తెలిపారు. భవిష్యత్‌లోనూ సామాజిక సేవా కార్యక్రమాలను విస్తృతంగా కొనసాగిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టౌన్ చైర్మన్ టి. సునీత, వైస్ చైర్మన్ వై. మమత, మైనార్టీ సెల్ ఎండి. ఇస్మాయిల్, ఫౌండేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రామకృష్ణాపురంలో ఘనంగా రైతు దినోత్సవం,బలరాముని జయంతి

-రైతుల సంక్షేమం కోసం భారతీయ కిసాన్ సంఘ్ కృషి

-జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా



కిర్లంపూడి,సెప్టెంబర్ 20 (కదిలించే వార్త)

కిర్లంపూడి మండలం రామకృష్ణాపురం గ్రామంలో శనివారం సాయంత్రం రైతు దినోత్సవం, బలరాముని జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా భారతీయ కిసాన్ సంఘ్ జెండాను ఆవిష్కరించి, బలరాములవారి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. అనంతరం కంటా కాశీవిశ్వనాథం అధ్యక్షతన జరిగిన సమావేశానికి భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు రాసంశెట్టి రాజా ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అన్ని వృత్తులకు సంఘాలు ఉన్నట్లే రైతులకు కూడా ప్రత్యేక సంఘం ఉందని, అదే భారతీయ కిసాన్ సంఘ్ అని పేర్కొన్నారు. రైతుల సమస్యల పరిష్కారం, రైతుల సంక్షేమం కోసం భారతీయ కిసాన్ సంఘ్ నిరంతరం పనిచేస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం కోశాధికారి కంపరపు నాగేశ్వరరావు కూడా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో దొడ్డా అప్పారావు, గోడే కాళీ ప్రసాద్, గోడే అచ్చారరాయుడు, బావసాని మార్కండేశ్వరరావు, కంటా బదరీనారాయణ, తిమిరిశెట్టి బాబూరావు, పట్టే సూర్యనారాయణ, చిలకమర్తి సత్యనారాయణ, గుడే వెంకటేశ్వరరావు, బత్తుల బాబి, పట్టే సుబ్బారావు, గుడే త్రిమూర్తులు, గోడే వెంకటేష్, తిమిరిశెట్టి సూరిబాబు, కొండి బాబ్జి తదితర రైతులు పాల్గొన్నారు.

## జగ్గంపేట రాజవేణి థియేటర్ వద్ద సందడి చేసిన చిత్ర మందిర్ సినీ బృందం





జగ్గంపేట సెప్టెంబర్ 20 (కదిలించే వార్త)

మండల కేంద్రమైన జగ్గంపేటలో రాజవేణి థియేటర్ దగ్గర ఆదివారం సినీ సందడి నెలకొంది. గుడ్ ఫిలిమ్స్ పిక్చర్స్ బ్యానర్ పై డైరెక్టర్ త్రిపర్ణం రాంప్రసాద్ చిత్రమందిర్ అనే లఘు చిత్రం సినీ షూటింగ్ నిర్వహించి ఎస్వి ఎఫ్ నాగేశ్వర,రాజవేణి థియేటర్లలో పలు సన్నివేశాలు చిత్రకరించారు ఈ సినీ షూటింగ్లో సీరియల్ ఆర్టిస్ట్ గిరి ప్రసాద్ పలువురు నటీనటులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రాంప్రసాద్ మాట్లాడుతూ ఈ చిత్రం ముఖ్య ఉద్దేశం సినీ థియేటర్లు రోజు రోజుకి ఎలా మనుగడ కోల్పోతున్నాయి అనే అంశంపై ఈ చిత్రం కథ ఉంటుందని డైరెక్టర్ రాంప్రసాద్ తెలిపారు. సినిమా షూటింగ్ చూసేందుకు ప్రేక్షకులు భారీగా తరలి రావడం జరిగింది

## పెంచిన నిత్యవసర వస్తువులు, కూరగాయల ధరలు తగ్గించాలి

- కర్నాకుల డిమాండ్




జగ్గంపేట సెప్టెంబర్ 20 (కదిలించే వార్త)

ప్రజలకు పెనుబారంగా మారిన నిత్యవసర వస్తువులు, కూరగాయల ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం గ్రామపంచాయతీ రంగవల్లి నగర్ లో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిత్యవసర వస్తువుల ధరలు, కూరగాయల ధరలు పెంచుకుంటూ పోతున్నారని కర్నాకుల అన్నారు. ఒకపక్క పంటలు పండక ప్రజల పరిస్థితి అయోమయంలో పడిపోయిందని, ఇప్పుడు నిత్యవసర వస్తువులు ధరలు పెంచి ఇంకా పెనుబారం పెంచారని ప్రభుత్వాన్ని విమర్శించారు. ఉచిత పథకాల పేరుతో రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతున్నారని ఆయన అన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో కూటమి ప్రభుత్వం ఓటమిపాలు అవ్వక తప్పదని ఆయన హెచ్చరించారు. తక్షణమే పెంచిన నిత్యవసర వస్తువుల ధరలు, కూరగాయల ధరలు తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు (విజృంభణ) రాష్ట్ర కార్యదర్శి కే.సతీష్, ఏ పి రైతు కూలి సంఘం జిల్లా నాయకులు కే. రామలింగేశ్వరరావు, రంగవల్లి నగర్ నాయకులు డాన్ శ్రీను, జాను, కే. మంగయ్యమ్మ, దేవి, సూరిబాబు,లక్ష్మి, కరుణ తదితరులు పాల్గొన్నారు.

## ఆశ కార్యకర్త పోస్టులకు దరఖాస్తులు చేసుకోండి-డీఎంహెచ్ఓ.

అనంతపురం, వైద్యం, కదిలించే వార్త, సెప్టెంబర్ 20 :

అనంతపురం జిల్లా పరిధిలో ఖాళీగా ఉన్న 26 ఆశా పోస్టులను భర్తీ చేయనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు ప్రకటించారు. గ్రామీణ ప్రాంతంలో 24, పట్టణ ప్రాంతంలో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన మహిళా అభ్యర్థులు ఈనెల 24వ తారీఖు లోగా ఆయా ఖాళీ గల పోస్టుల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పించాలని ఆయన కోరారు. కాళీ పోస్టులు, , అర్హతల, దరఖాస్తు నమూనా వివరాలు hppt.//ananthapuramu.ap.gov.in వెబ్సైటు లో పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. పట్టణ గ్రామీణ ఆరోగ్య పోషక కమిటీల ద్వారా అర్హులను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు.

# రమణయ్యపేట బాల వినాయకుడి మండపం వద్ద ఘనంగా అన్నసంతర్పణ





-9వ వార్షికోత్సవం సందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ

కిర్లంపూడి,సెప్టెంబర్ 20 (కదిలించే వార్త) :

కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం రమణయ్యపేటలో దొడ్డి ముసలయ్య ఇంటి వద్ద ఏర్పాటు చేసిన బాల వినాయకుడి మండపంలో 9వ వార్షికోత్సవం సందర్భంగా అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాల వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం భక్తులకు,గ్రామ ప్రజలకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు,గ్రామస్థులు కార్యక్రమంలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ బాల వినాయకుడి కృపాకటాక్షాలతో,గ్రామ ప్రజల సహాయ సహకారాలతో 9వ వార్షికోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఏడాది భక్తిశ్రద్ధలతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని,అన్నసంతర్పణకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు,నాయకులు పాల్గొని బాల వినాయక స్వామి వారిని దర్శించికొని అన్న ప్రసాదం స్వీకరించారు.

# జగ్గంపేటలో ద్విచక్ర వాహన ప్రియుల సందడి

-రాయల్ ఎన్ ఫీల్డ్ రైడర్ల ఆత్మీయ భేటీ

-సేవే లక్ష్యంగా రైడర్ల ట్రస్ట్ విపత్తు సమయంలో అండగా ఉంటాం

-గొల్లలగుంటలో రాయల్ ఎన్ ఫీల్డ్ శబ్దంతో మార్మోగిన రోడ్లు

జగ్గంపేట సెప్టెంబర్ 20 (కదిలించే వార్త):

ద్విచక్ర వాహనాల్లో రారాజుగా పేరుగాంచిన రాయల్ ఎన్ ఫీల్డ్ వాహన ప్రియుల ఆధ్వర్యంలో జగ్గంపేట మండలం గొల్లలగుంటలో ఆదివారం ఉదయం ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. కాకినాడ జయలక్ష్మి రాయల్ ఎన్ ఫీల్డ్ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న రైడర్ల సేవా ట్రస్ట్ కాకినాడ నుండి జగ్గంపేట వరకు ర్యాలీగా తరలివచ్చింది. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు నరసింహరాజు మాట్లాడుతూ కీలక విషయాలు వెల్లడించారు. ఈ సందర్భంగా నరసింహ రాజు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాల్లో, ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు అండగా నిలిచేందుకే ఈ ట్రస్ట్ ను స్థాపించామని తెలిపారు. రాయల్ ఎన్ ఫీల్డ్ అంటే ఒక వాహనం కాదు, ఒక బంధం, ఒక ప్రత్యేక శైలి అని అన్నారు. గతంలో రాయల్ ఎన్ ఫీల్డ్



రైడర్ గా తనకు మంచి గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. రాయల్ ఎన్ ఫీల్డ్ వాహనాన్ని ఇష్టంతో నడిపే ప్రతి ఒక్కరూ ఈ ట్రస్ట్ లో సభ్యునిగా చేరవచ్చని ఆహ్వానించారు. జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలను విస్తరించేందుకు ప్రతి ఒక్కరూ సంసిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో పాల్గొన్న రైడర్లందరూ క్రమశిక్షణతో, హెల్మెట్ ధరించి ర్యాలీ చేయడం విశేషంగా ఆకట్టుకుంది.



# తంటికొండ వెంకటేశ్వర స్వామి ఆలయానికి మహర్దశ

-ఆలయ పునర్నిర్మాణానికి 6 కోట్లు మంజూరు చేసిన టీటీడీ

-30 లక్షల విరాళంతో చరిత్ర సృష్టించిన గోకవరం మాజీ ఎంపీపీ డివివి తనయుడు దాసరి సీతారాం

-మ్యాచింగ్ గ్రాంట్ కింద భారీ నిధులు

-ఎమ్మెల్యే నెహ్రూ చేతుల మీదుగా టీటీడీ ఈవో కు విరాళం అందజేత

గోకవరం సెప్టెంబర్ 20 (కదిలించే వార్త) :

గోకవరం మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తంటికొండ శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి మహర్దశ పట్టింది. దేవస్థాన పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ కృషితో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారికంగా ఆమోదం తెలిపింది. మ్యాచింగ్ గ్రాంట్ పథకం కిందపేట ఎస్టేట్ ప్రొప్రైటర్, శ్రీ వేంకటేశ్వర స్వామి గుడి ఫౌండర్ దాసరి సీతారామయ్య మనవడు గోకవరం మండల మాజీ ఎంపీపీ డీవీవీ సూర్యనారాయణ (డబుల్ మీసాలు) తనయుడు దాసరి సీతారామకృష్ణ 30 లక్షల రూపాయల విరాళాన్ని ప్రకటించడంతో, దానికి అనుగుణంగా టీటీడీ 6 కోట్ల రూపాయలను శాంక్షన్ చేసింది. ఆదివారం తిరుమలలో జరిగిన కార్యక్రమంలో టీటీడీ



బోర్డు సభ్యులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, జగ్గంపేట శాసనసభ్యుడు జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా సీతారాం విరాళాన్ని టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్రకు అందజేశారు. ఈ సందర్భంగా తంటికొండ దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం తంటికొండ క్షేత్ర అభివృద్ధికి మార్గం సుగమం అయింది. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న పునర్నిర్మాణ కల నెరవేరడంతో



భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విరాళం ఇచ్చిన దాత దాసరి సీతారామకృష్ణను, కృషి చేసిన టీటీడీ బోర్డు సభ్యులు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను స్థానికులు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తంటికొండ దేవస్థానం చైర్మన్ బదిరెడ్డి అచ్చన్న దొర, దాత దాసరి సీతారామకృష్ణ తనయుడు దాసరి వెంకట సూర్య తేజ తదితరులు పాల్గొన్నారు

# ఉపాధ్యాయుని వివాహానికి హాజరైన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

-మెగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించిన అక్రమ్ బాషా

-ప్రత్యేక ఆహ్వానం మేరకు బాషా వివాహానికి హాజరైన ఎమ్మెల్యే

-ఉద్యోగం వచ్చాక తన వివాహం ఖరారు అయిందన్న అక్రమ్ బాషా

-కూటమి ప్రభుత్వానికి, నారా లోకేష్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన ఉపాధ్యాయుడు బాషా

అనంతపురం, కదిలించే వార్త, సెప్టెంబర్ 20 :

మెగా డీఎస్సీలో ఉపాధ్యాయ ఉద్యోగం సాధించిన అభ్యర్థి వివాహానికి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హాజరయ్యారు. అనంతపురం నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డుకు చెందిన ఎంఎస్ అక్రమ్ బాషా బిటెక్ తో పాటు డిఎడ్ చదివారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీలో ఎస్జీటీగా ఎంపికయ్యారు. ఉపాధ్యాయ పోస్టు వచ్చిన తర్వాత బాషాకు మంచి సంబంధం కుదిరింది. వీరి వివాహానికి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ని ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈనేపథ్యంలో శిల్పారామంలో జరిగిన అక్రమ్ భాష వివాహానికి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హాజరయ్యారు. వధూవరులను ఆయన ఆశీర్వదించారు. మెగా డీఎస్సీలో ఉద్యోగం వచ్చిన తర్వాతనే నాకు వివాహం నిశ్చమైందని ఈ సందర్భంగా ఎమ్మెల్యేతో అక్రమ్ బాషా తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ మెగా డీఎస్సీ ద్వారా 16వేల 347మందికి ఉద్యోగాలు వచ్చాయని.. ఇది మంత్రి నారా లోకేష్ వలనే జరిగిందన్నారు. ఇందులో ఉద్యోగాలు సంపాదించిన వారి జీవితాలు కూడా మారిపోయాయన్నారు.



# మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

-ఈనెల 21వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ

-సోమవారం ఉదయం 10 గంటల నుండి పిజిఆర్ఎస్ నిర్వహణ..

-రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో "మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100" అనే బ్యానర్‌ను ఏర్పాటు చేయాలి

-జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

-జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..

అనంతపురం, కలెక్టరేట్, కదిలించే వార్త, సెప్టెంబర్ 20 :

- మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి వీవవసిశీయుఎ.ఖజూ.స్త్రశీజ.అఅ (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. రెవెన్యూ పరిధిలోని అన్ని ఫిర్యాదుల పరిష్కార అధికారుల కార్యాలయాలలో "మీకోసం టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 1100" అనే బ్యానర్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

-ఈనెల 21వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహణ :

- ఈనెల 21వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 10:00 నుండి నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. సోమవారం ఉదయం 10:00 నుండి పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ దేను నిర్వహించడం జరుగుతుందన్నారు. - ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజే యాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కార మైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం ఉదయం 10:00 నుండి పూర్తి అయ్యే వరకు డివిజన్, మండల మరియు ఎస్.జి.ఎస్.డబ్ల్యూ స్థాయిలలో పి.జి.ఆర్.ఎస్. గ్రీవెన్స్ దేను నిర్వహించాలని ఆర్.డి.ఓలు, తహసీల్దార్లు మరియు పి.డి.ఓలకు సూచించడమైనది.



